క్లుప్తంగా

ఉగాది శుభాకాంక్షలు

గుడివాడ టౌన్: నియోజకవర్గ ప్రజలకు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ క్రోధినామ సంవత్సరంలో ప్రజలకు అన్నీ శుభాలు జరగాలని, సమృద్ధిగా వానలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులకు మేలు కలగాలని, సకల వృత్తుల వారు ఆనందంగా ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పల్లెల్లో, పట్టణాల్లో ప్రతి ఇల్లూ కళకళలాడాలని, మన సాంప్రదాయాలు కలకాలం వర్ధిల్లాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. షడ్రుచుల ఉగాదితో ప్రారంభమయ్యే శ్రీక్రోధినామ సంవత్సర ప్రారంభంలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విజయంతో ప్రజలకు మరింత మెరుగైన పాలన అందుతుందన్నారు.

పూర్తి స్థాయిలో నీటిని నింపుతాం

గుడివాడ టౌన్: ఇరిగేషన్ శాఖ కాలువలు వదలగానే పూర్తి స్థాయిలో చెరువులు నీటితో నింపుతామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు అన్నారు. సోమవారం ఆయన హెడ్ వాటర్ వర్క్స్‌లో అన్ని విభాగాలు పరిశీలించారు. నీటిని నింపేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ర్యాపిడ్ స్పీడ్‌లో వాటర్ ఫిల్లింగ్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రజలకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా తిరిగి వర్షాకాలం వచ్చే వరకు కావాల్సిన స్థాయిలో నీరు అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

ఇఫ్తార్ విందు ఏర్పాటు



వెంట్రప్రగడ (పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ, లక్ష్మీపురంలోని మసీదులో సోమవారం రాత్రి ముస్లింలకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ తరఫున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎంపీపీ సురేష్, పామర్రు మార్కెట్ మాజీ డైరెక్టర్ వరప్రసాద్, గ్రామ పార్టీ కన్వీనర్ జానకరామయ్య ఆధ్వర్యంలో ముస్లింలకు బిర్యానీ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి, సచివాలయాల మండల కన్వీనర్ జాజుల చిన్నారి, మండల అధ్యక్షుడు సోమేశ్వరరావు, నాయకులు శివరామప్రసాద్, రమేష్, చంద్రశేఖర్, దాసు పాల్గొన్నారు.

పరీక్షలను పర్యవేక్షించిన ఎంఈఓ

ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న ఎస్ఏ–2, సీబీఏ పరీక్షలను ఎంఈఓ కె.నరేష్‌కుమార్ సోమవారం పర్యవేక్షించారు. మండలంలోని వడాలి జెడ్పీ హైస్కూల్లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఈ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు చెప్పారు. వడాలి హైస్కూల్లో జరుగుతున్న పరీక్షల తీరుపై హెచ్ఎం వి.ప్రభుదాస్, ఉపాధ్యాయుడు సీమెచ్ నాగమల్లేశ్వరరావు ఎంఈఓకు వివరించారు.

43 మంది వలంటీర్ల రాజీనామా



మొవ్వ: ప్రతిపక్ష నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండలంలోని వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు అందజేశారు. మొవ్వ మండలంలోని కాజ గ్రామానికి చెందిన రెండు సచివాలయాల నుంచి 24 మంది వలంటీర్లు, పెదముత్తేవి గ్రామ సచివాలయం నుంచి 19 మంది తమ తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు సోమవారం అందజేశారు. నిస్వార్థంగా తాము చేసిన సేవలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రజలు గుర్తించారని వారు పేర్కొన్నారు.

రేపటి నుంచి అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

పమిడిముక్కల: గుర్రాల్లంకలో టీటీడీ, భక్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ పద్మాల అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం శ్రీ గణపతిపూజ, అంకురార్పణ, అగ్నిప్రతిష్టాపన, క్షీరాధివాసం, హోమం, సాయంత్రం అగ్నిధ్యానం, నవగ్రహాల మంత్రహోమం, గురువారం గణపతి హోమం, జలాధివాసం, సాయంత్రం గ్రామోత్సవం, అగ్నిధ్యానం, మహాశాంతిహోమం, శుక్రవారం ఉదయం పద్మాల అంకమ్మ తల్లి, గణపతి, పోతురాజుసాముల విగ్రహ ప్రతిష్ట జరుగుతాయని పేర్కొన్నారు.

జవహర్ నవోదయకు విద్యార్థిని ఎంపిక

మండవల్లి: మండవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్ షణ్ముఖప్రియ ఆరో తరగతి ప్రవేశానికి ఎంపికైనట్లు హెచ్ఎం ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు షణ్ముఖప్రియను అభినందించారు.

ప్రచారంలో దూసుకుపోతున్న ఎమ్మెల్యే కొడాలి నాని



భారీగా తరలివచ్చిన అభిమానుల మధ్య ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. సోమవారం స్థానిక 33, 34 వార్డులలో ఆయన ముమ్మరంగా ప్రచారం చేశారు. 33వ వార్డు ఇన్‌చార్జి నయనవరపు శేషుబాబు, 34వ వార్డు ఇన్‌చార్జి టి. మోహన్ ఆధ్వర్యంలో ప్రచారం సాగింది. తొలుత నీలా మహల్ రోడ్‌లోని ఆంజనేయ స్వామి వారి దేవస్థానం వద్ద కొడాలి నాని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వచనం తీసుకున్నారు. 40 డిగ్రీల ఉష్ణోగ్రతను కూడా లెక్కచేయకుండా ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మహిళలు నానికి మద్దతుగా ప్రచారంలో కొనసాగారు. గడప గడపకు తిరుగుతూ ప్రచారం కొనసాగించారు. నయనవరపు శేషుబాబు కుటుంబ సభ్యులు గజమాలతో కొడాలి నానికి స్వాగతం పలికారు. గడప గడపకు మహిళలు హారతులు ఇస్తూ నానికి ఆశీర్వచనాలు చెప్పారు. మహిళల అభ్యున్నతికి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో గొప్ప కార్యక్రమాలు చేస్తున్నారని మహిళల పూర్తి మద్దతు వైఎస్సార్ సీపీకి ఉంటుందన్నారు. చిరు వ్యాపారులను పలకరిస్తూ ముందుకు సాగారు. స్థానిక టైలర్స్ స్ట్రీట్‌లో టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నానికి ఘన స్వాగతం తెలిపారు. మహిళా టైలర్లు నానికి హారతులు పట్టారు. రెల్లి వీధిలో యువత నానికి మద్దతుగా జేజేలు పలికారు. ప్రచారం పూర్తయ్యే వరకు యువత నాని వెంట నడిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ, గ్రామాన సచివాలయాల ఏర్పాటు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం, ఆరోగ్య సురక్ష, అవ్వాతాతలకు ఇంటి వద్ద పెన్షన్ అందజేత తదితర సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ సేవలందుకుంటున్న ప్రతి ఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలుకుతున్నారన్నారు. ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు హామీలను ప్రజలు నమ్మడంలేదన్నారు. తాము చేసిన మేలు మీరు పొంది ఉంటేనే వైఎస్సార్ సీపీకి ఓటు వేయండి అని చెబుతున్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, అన్ని విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొడాలి నానిని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

గుడివాడరూరల్: వేసవిలో రోజురోజుకు పెరుగుతున్న ఎండల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగానే అన్ని చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కె.జ్యోతి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు సోమవారం మండల స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన తాగునీటి కోసం కాలువలకు నీరు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో ఉన్న అన్ని పంచాయతీ చెరువుల్లో నూటికి నూరుశాతం తాగునీటిని అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ నింపుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం రోజురోజుకీ ఎండలు పెరుగుతున్నాయని రానున్న మే నెలలో తాగునీటి కొరత ఉండే అవకాశం పొంచి ఉందని, ముందస్తుగానే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఇప్పుడే తాగునీటి చెరువులను నిండుగా నింపుకోవాలన్నారు. అదే విధంగా కాలువల వెంబడి అనాథరైజ్డ్ మోటార్లు ఏమైనా ఉంటే వెంటనే తొలగించాలని ఆదేశించారు. శివారు గ్రామాలకు సక్రమంగా తాగునీరు అందే విధంగా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ అబ్దుల్ బేగ్, పంచాయతీ కార్యదర్శులు హరికృష్ణ, అనూల, స్నేహలత, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

కార్నియా సేకరణ

గుడివాడ టౌన్: కొనకళ్ల సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం కార్నియా(ఐ బాల్స్) సేకరించారు. స్థానిక 11వ వార్డుకు చెందిన గొట్టిపాటి విజయ్‌బాబు మృతి అనంతరం కుటుంబ సభ్యుల అంగీకారంతో కార్నియా సేకరించినట్లు తెలిపారు. సేకరించిన కార్నియాను విజయవాడకు చెందిన అగర్వాల్ కంటి ఆస్పత్రికి తరలించినట్లు సీతయ్య పేర్కొన్నారు.

బాలికను వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్

నందివాడ: బాలికను వేధిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశామని నందివాడ ఎస్ఐ ఎన్.చంటిబాబు సోమవారం తెలిపారు. మండలంలోని అరిపిరాలకు చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన మేడేపల్లి ప్రదీప్ వేధిస్తున్నాడని బాలిక ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ప్రదీప్‌ను సోమవారం అరెస్ట్ చేశామన్నారు. అనంతరం గుడివాడ జిల్లా కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ప్రదీప్‌కు 14రోజులు రిమాండ్ విధించారని తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం మచిలీపట్నం సబ్‌జైల్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు

తోట్లవల్లూరు: వృద్ధురాలి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన తోట్లవల్లూరులో జరిగింది. పోలీసుల కథనం మేరకు తోట్లవల్లూరు శివారు కలాసుమాలపల్లికి చెందిన బూసి పాప యాచన చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తోంది. ఆమె గత నెల 30వ తేదీ నుంచి కనిపించకపోవడంతో కుమార్తె జి. శివనాగ లక్ష్మి ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వృద్ధురాలి అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు.

ఎస్సీలను ఓటు అడిగే హక్కు కొడాలి నానికే ఉంది

గుడివాడ టౌన్: ఎస్సీలను దగ్గరకు చేర్చుకుని, వారికి అండగా నిలబడుతున్న నాయకుడు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. కొడాలి నాని ప్రచారంలో భాగంగా బ్లూ కండువా కప్పుకోడాన్ని టీడీపీ నాయకుడు కొడాలి రామరాజు విమర్శించడం అవివేకం అన్నారు. కొడాలి నాని జైభీమ్‌కు చెందిన బ్లూ కండువా కప్పుకుని ఓట్లు అడుగుతున్నారని రామరాజు ఎద్దేవా చేయడం సరికాదన్నారు. బ్లూ రంగు వైఎస్సార్ సీపీ జెండాలోనే ఉందన్నారు. అంటే దళితులు, వెనుక బడిన వర్గాలు, పేదలు, అణగారిన వర్గాలు తమ పార్టీలో అగ్రస్థానంలో ఉంటారనడానికి నిదర్శనం అన్నారు. నిన్న మొన్నటి వరకు కొడాలి నాని వద్ద తిరిగిన రామరాజు డబ్బుకోసం టీడీపీలో చేరి తిరిగి దళితులను కించపర్చేలా విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కొడాలి రామరాజు దళితులను అవమానించేలా విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్, ఉపాధ్యక్షుడు మామిళ్ల ఎలీషా, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెండా చంద్రపాల్, నాయకులు వెంపటి సైమన్, ఏలేటి విలియం జోషి, తాళ్లూరి ప్రశాంత్, పింకి, తంటేపూడి అనిల్, మాతంగి మమ్మి, బెజ్జం సువర్ణరాజు, సీహెచ్ జోషి, ప్రభాకర్, నారాయణ పాల్గొన్నారు.

కూటమి నేతల మాటలు నమ్మరు



కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న దూలం వినయ్

ముదినేపల్లి రూరల్: నియోజకవర్గంలోని ఎన్డీయే కూటమి నేతల మాటలు నమ్మే స్థితిలో యువత లేదని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కుమారుడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత దూలం ఆదివినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెంలో వివిధ పార్టీలకు చెందిన వంద మంది యువకులు సర్పంచ్ తాడంకి శిరీష, ఏఎంసీ వైస్ చైర్మన్ బత్తిన కిషోర్ ఆధ్వర్యంలో వినయ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో ఆదివారం రాత్రి చేరారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ టీడీపీ పాలనలో యువతకు అనేకరకాల బూటకపు వాగ్దానాలు చేసి చంద్రబాబు దారుణంగా మోసగించారన్నారు. అదే విధంగా నేటి నియోజకవర్గ ఎన్డీయే నాయకులు అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమిలేదని విమర్శించారు. అన్నివర్గాల ప్రజలను దారుణంగా మోసగించి అవినీతికి పాల్పడ్డారేతప్ప ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. అలాంటి నాయకులు నేడు ఓట్ల కోసం తిరిగి ప్రజల ముందుకు వస్తున్నారని, దీనిని సహించలేని యువత ఆయా పార్టీలను వదిలి వైఎస్సార్ సీపీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు.

కూటమి నేతలు పేదల వ్యతిరేకులు

ముదినేపల్లి రూరల్: నియోజకవర్గంలోని ఎన్డీయే కూటమి నేతలు పేదల వ్యతిరేకులుగా స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ అభివర్ణించారు. మండలంలోని చేవూరులో వైఎస్సార్ సీపీ తరఫున ఎన్నికల ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజాసమస్యలను ఏనాడు పట్టించుకోలేని నాయకులు స్థానికంగా నివాసం ఉండని వారు నేడు ఎన్నికలు వచ్చేసరికి ప్రజల ముంగిటకు వస్తున్నారన్నారు. వీరి వల్ల ప్రజలకు ఒరిగేదేమిలేదని ఇలాంటి వారిని ఎన్నికల్లో ఓడించి తీరాలన్నారు. అన్నివర్గాల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన డీఎన్నార్, కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను గెలిపిస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. హౌసింగ్ కార్పోరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు బొప్పర్ల సునీత, రామారి రాధా, పార్టీ నాయకులు మోత్రు ఏసుబాబు, కోమటి విష్ణువర్ధన్, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

కలిదిండి: ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోడలు శ్రీఅనుపమ కోరారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారం భాగంగా పెద తాడినాడలో నాయకులతో కలిసి ఇంటింట ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. ఏలూరు పార్లమెంట్ అభ్యర్థిగా కారుమూరి సునీల్ కుమార్‌యాదవ్, కైకలూరు అసెంబ్లీ అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావును గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, వైస్ ఎంపీపీ కనక దుర్గారాణి, చిన తాడినాడ సర్పంచ్ ఏసుబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ నీలపాల అయినాల బ్రహ్మాజీ పాల్గొన్నారు.

ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు

ముదినేపల్లి రూరల్: ఉగాది సందర్భంగా మండలంలోని దేవదాయశాఖ ఆధీనంలో ఉన్న పలు ఆలయాల్లో మంగళవారం పంచాంగ శ్రవణాలు జరగనున్నాయి. ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం వేదపండితులతో పంచాంగ శ్రవణం నిర్వహిస్తామని ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య సోమవారం తెలిపారు. ఆదేవిధంగా సింగరాయపాలెం బావాజీ మఠంలోని కోదండరామాలయం, వడాలలోని శ్రీజగన్నాథస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణాలు జరుగుతాయని ఆలయాల కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

సీఎంగా జగన్, ఎమ్మెల్యేగా కొడాలి నాని గెలుపే లక్ష్యం

ఎంపీపీ పెయ్యల ఆదాం



నందివాడ: ముఖ్యమంత్రిగా రెండోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, గుడివాడ ఎమ్మెల్యేగా ఐదో సారి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) గెలుపే లక్ష్యంగా ఇంటింటికీ ప్రచారానికి శ్రీకారం చుట్టామని ఎంపీపీ పెయ్యల ఆదాం పేర్కొన్నారు. మండలంలోని చినలింగాల గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యురాలు కందుల దుర్గాభవానీ, వైఎస్సార్ సీపీ నాయకులు కందుల నాగరాజు, తోట నాగరాజుతో కలసి ఎంపీపీ ఎన్నికల ప్రచారానికి సోమవారం సాయంత్రం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. తొలుత ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కృష్ణారెడ్డి, సీతారామరాజు, కలపాల నాగేశ్వరరావు(నాగులు), భవానీ ప్రసాద్, చంద్రశేఖరరెడ్డి, సుధాకరరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



పమిడిముక్కల: మండలంలోని అమీనపురం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ వెంకటేష్(17) ఇంటర్మీడియట్ చదువుతూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి తండ్రి లక్ష్మణరావు స్నేహితులు తాడంకి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1996–97 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో రూ.81,200ను ఆర్థిక సాయం అందించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, తాము ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

మండవల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ పునః ప్రతిష్ట పురస్కరించుకుని మండవల్లి సెంటర్‌లో సోమవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె శాంతరాజు, గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సీహెచ్ విజయ్, మెండా సురేష్ పాల్గొన్నారు.

కైకలూరుకు పుష్కలంగా నీరందించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు



గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్‌కు హారతి ఇస్తున్న మహిళ

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: కైకలూరు నియోజకవర్గానికి పుష్కలంగా తాగునీటిని అందించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఏలూరు, కృష్ణా జిల్లాల కలెక్టర్లను కోరారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి వరకు నీటి ఎద్దడి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. తక్కువ వర్షపాతం కారణంగా తాగునీటి సమస్య ఇప్పుడు ఉత్పన్నమైందన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఈ నెల 6 నుంచి కృష్ణా, ఏలూరు జిల్లా ప్రాంతాలకు 10 రోజుల పాటు నీటిని విడుదల చేయాలని ఆదేశించారన్నారు. నియోజకవర్గంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులు మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. దాదాపు 3 నుంచి 5 కిలోమీటర్ల దూరంలో దిగువ గ్రామాల సర్పంచ్‌లు తాగునీటిని మోటార్లతో తోడుకోవాలని బెదిరించే ధోరణితో మాట్లాడుతున్నారన్నారు. కేవలం మూడు రోజులు మాత్రమే నీరు వస్తోందని, మోటార్లతో నింపుకోపోతే నీరు రాదని భయపెడుతున్నారన్నారు. అందరూ మోటార్లతో నీటిని తోడుకోవడం సాధ్యపడదన్నారు. నియోజకవర్గంలో 110 గ్రామాలలో తాగునీటి చెరువులకు తగనంత నీటిని గుడ్లవల్లేరు లాకుల నుంచి అందించాలన్నారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. నియోజకవర్గానికి గుడ్లవల్లేరు లాకుల నుంచి పోల్‌రాజ్, క్యాంప్‌బెల్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారన్నారు. శివారు కైకలూరు నియోజకవర్గానికి సరపడా నీటిని ఎక్కువ రోజులు విడుదల చేయాలని రెండు జిల్లాల కలెక్టర్లను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీరరాజు, మండల పార్టీ అధ్యక్షుడు భట్రాజు శివాజీ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, వివిధ గ్రామాల సర్పంచులు దానం మేరీ నవరత్నకుమారి, ఉప్పలపాటి నాగమణి, ఉలసి వసంతకుమారి, జయమంగళ కాసులు, నున్న రాంబాబు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలి

మండవల్లి: ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చిన సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండవల్లిలోని 1,2 వార్డులలో సోమవారం గుడ్ మార్నింగ్ కార్యక్రమం జరిగింది. పెద్దఎత్తున ప్రజలు ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతూ వారికి చేసిన సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధి వైఎస్ జగన్ చేసి చూపారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా డీఎన్నార్‌కు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు బి.యేసోబురాజు, నాయకులు, ముంగర మల్లికార్జునరావు, బొమ్మనబోయిన గోకర్ణ, పెరుమాళ్ల సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు గుడివాడ సత్యప్రసాద్ (బాబీ), ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బలే నాగరాజు, మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, సర్పంచ్‌లు ధామస్, వీరబాబు, జంగం రాందాసు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మళ్లీ మద్దతు తెలపాలి

పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్



పామర్రులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: పేదలకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూరాలంటే రానున్న కాలంలో వైఎస్సార్ సీపీకి మళ్లీ ప్రజలు మద్దతు తెలపాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. పామర్రులో కొరముక్కవానిపురం, ఇందిరానగర్, చాట్లవానిపురం తదితర ప్రాంతాల్లో 'మన ఇంటికి మన కైలే' అనే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. స్థానికులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ప్రతి ఇంటినీ సందర్శిస్తూ ఆప్యాయంగా అందరినీ పలకరిస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో పయనించాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవలన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషికి మనం అందరూ కలిసి కట్టుగా సహకరించాలన్నారు. గత చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలతో నిరంకుశ పాలన చేసి పేదలను అనేక ఇబ్బందులకు గురి చేశారన్నారు. ప్రస్తుతం వారే కల్లబొల్లి మాటలతో మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి మాటలను తిప్పి కొట్టాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందిజేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అమూల్యమైన ఓటును ఫ్యానుగుర్తుపై వేసి పామర్రు ఎమ్మెల్యేగా తనను, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, కో–ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, ఆర్బీకే మండల అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు తిరుమలశెట్టి వాసు, బడుగు సుబ్రమణ్యం, కాకొళ్ల అశోక్, నత్తా రాము, జక్కుల నందిరాజు, మద్దుల సుబ్రమణ్యం, నందిపు నాగ నాంచారయ్య, ఆరేపల్లి శ్రీహరి, బొమ్మారెడ్డి మాధవరెడ్డి, జువ్వనపూడి దివ్య పాల్గొన్నారు.